



ఏర్పాట్లపై అధికారులను ఆరా తీస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

నేటి నుంచి...

ఎన్‌టిఆర్ వైద్య సేవలు బంద్

- నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెరిగిపోతున్న బకాయిలు

- ప్రభుత్వం నుంచి అరకొర నిధులు

ఎన్‌టిఆర్ వైద్య సేవలందిస్తున్న నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీని దాదాపు 3,045 రకాల వ్యాధులకు వర్తింపజేసింది. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులకు, ఆర్థో, కిడ్నీ, తదితర మేజర్ వైద్య సేవలకు ప్రభుత్వం నిధులు ఇస్తుంది. ఎన్టీఆర్ వైద్య సేవలు పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడంతో ఎపి స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెట్వర్క్ ఆసుపత్రుల నిర్వాహకులు శుక్రవారం నుండి ఎన్‌టిఆర్ వైద్య సేవలు నిలిపివేయనున్నారు..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ నెట్వర్క్ ఆసుపత్రులలో ఎన్టీఆర్ వైద్య సేవలను శుక్రవారం నుండి బంద్ చేయనున్నారు. జిల్లాలో పేరుకుపోతున్న బకాయిలతో నెట్వర్క్ ఆసుపత్రుల నిర్వాహకులు నిర్వహణ భారమైందని, ప్రభుత్వం నుండి నిధులు విడుదల చేయకుంటే నిర్వహించడం కష్ట సాధ్యమని యాజమాన్యాలు అంటున్నాయి. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 99 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 55 ప్రయివేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఈ ఆస్పత్రులకు దాదాపు వంద కోట్ల వరకూ బిల్లులు బకాయి ఉన్నాయి. గత ప్రభుత్వంలోను బకాయిలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ నెట్వర్క్ ఆసుపత్రులు కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు వస్తాయని ఆశించినా నిరాశ మిగిలింది. ఒక్కొక్క ఆసుపత్రికి రూ. 80 లక్షల నుండి రూ. 2 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులకు రూ.10 కోట్ల నుండి రూ. 12 కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలో ఒక్కొక్క ఆసుపత్రికి ఇచ్చింది కేవలం రూ.3 లక్షల లోపే. కోట్లలో బకాయిలు ఉండడంతో ఎన్టీఆర్ వైద్య సేవలు అందిచలేమని ఆస్పత్రుల నిర్వాహకులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ నుండి రూ.2,700 కోట్లు నెట్‌వర్క్ ఆసుపత్రులకు రావాల్సి వుంది. బకాయిలు విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఆస్పత్రుల నిర్వాహకులు విమర్శిస్తున్నారు. 2018-19లో ఉన్న ధరలే ఇప్పటికి కొనసాగుతున్నాయని, దీంతో అత్యధునాతన పరికరాలతో వైద్యం అందించాలంటే కష్టతరమౌతుందని నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

14లోగా ఏర్పాట్లు పూర్తి

-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి -ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ప్రధానమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను ఈనెల 14వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి జిల్లా అధికారులను ఆదేశించారు.. అదే రోజున పిఎం పర్యటన రిహార్సల్ ఉంటుందని పేర్కొన్నారు. గురువారం నన్నూరు గ్రామ శివారులలోని ప్రధానమంత్రి బహిరంగ సభ వేదిక సమీపంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెలిప్యాడ్‌కు సంబంధించిన ఏర్పాట్ల పురోగతి గురించి ఆర్ అండ్ బి ఎస్ఇతో ఆరా తీశారు. ఆర్అండ్‌బి ఎస్ఇ స్పందిస్తూ ప్రధాన మంత్రి కోసం 3 హెలిప్యాడ్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రావెల్ వేశామని, మెటల్ లేయర్, బిటి లేయర్ వేయాల్సి ఉందన్నారు. దీనిని వేగవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. 11 పార్కింగ్ ప్రదేశాల్లో మొక్కలు తొలిగించే పనులు, లెవెలింగ్ పనులు పూర్తి చేశారన్నారు. ఇంటర్నల్ రోడ్స్ ఈనెల 11 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశంలో మెడికల్ క్యాంప్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఫైర్ ఇంజన్, టాయిలెట్, అంబులెన్స్‌లు, తాగు నీరు ఏర్పాటు చేయాలని, వాటికి ప్లేస్ రిజర్వ్ చేసి పెట్టుకోవాలన్నారు. నన్నూరు టోల్ గేట్ వద్ద కూడా హెల్ప్‌డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. డివైడర్ల దగ్గర ప్లాంటేషన్ బాగా చేయించాలన్నారు. టాయిలెట్ల ఏర్పాటు గురించి కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ ఇప్పటికి 94 టాయిలెట్లను పెట్టామన్నారు. ఈనెల 15 నాటికి అన్ని టాయిలెట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు వివరించారు. పారిశుధ్య పనులను పూర్తి చేయాలన్నారు. బస్సుల్లో ప్రజలకు భోజనాలు , తాగు నీరు బాటిళ్లను కూడా అందచేయాలని ఆదేశించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఒక్కొక్కరికి మూడు లీటర్ల నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇని ఆదేశించారు. నన్నూరు టోల్ ప్లాజా దగర నుండి 8 అప్రోచ్ రోడ్ల దగర పాయింట్లు ఏర్పాటు చేసుకొని ప్రజలకు మజ్జిగ, తాగు నీరు అందచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ని ఆదేశించారు.. 20 బెడెడ్, 10 బెడెడ్ ఆసుపత్రులను సిద్ధం చేయాలని కలెక్టర్ మాన్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. హాస్పిటల్ లో ఆర్థోపెడిక్ డాక్టర్లు, స్పెషలిస్ట్ డాక్టర్లను, మెడికల్ సిబ్బంది ఆసుపత్రిలో ఉండాలన్నారు. రవాణాకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. కాన్వాయ్ వాహనాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ డిటిసిని ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఛైర్మన్ (ఎపిఐఐసి) మంతెన రామరాజు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్ర రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎపి ద్రోహి మోడీ గోబ్యాక్

-15న భారీ నిరసన ర్యాలీ

- వామపక్ష పార్టీ నేతలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని చెప్పి మాటతప్పిన మోడీకి కర్నూలులో పర్యటించే హక్కులేదని 16న కర్నూలులో మోడీ పర్యటనను నిరసిస్తూ 15న మోడీ గోబ్యాక్ అంటూ నిర్వహించే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని వామపక్షపార్టీల నేతలు పిలుపునిచ్చారు. గురువారం సిఆర్ భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, నక్కి.లెనిన్బాబు, ఎపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం, సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, టి.రాముడు, కెవి.నారాయణ, నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, క్రిష్ణలతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. గిడ్డయ్య, గౌస్ దేశాయ్ , నాగన్నలు మాట్లాడుతూ 11వ సంవత్సరం మోడీ పాలనలో ఎపికి చేసింది ఏమిలేదన్నారు. జిఎస్‌టి రూపంలో రూ.8వేల కోట్లు అనవసరంగా వసూలు చేస్తున్నారన్నారు. గతంలో విమర్శలు చేసిన చంద్రబాబునాయుడు నేడు జిఎస్‌టి తగ్గించాడని ఉత్సవాలు చేసుకోవడం దుర్మార్గమన్నారు. రాయలసీమకు ఒక్కసాగునీటి ప్రాజెక్టు ఇవ్వకుండా, ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా సంబరాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 11 సంవత్సరాల నుండి జిఎస్‌టి భారం మోపి ప్రజలను ఇబ్బందుల గురిచేసిన వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇస్తారా అని ప్రశ్నించారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారా లేదా, విశాఖలో స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణను అడ్డుకుంటారా లేదా అన్న విషయం తెలియజేయాలన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం ఏమి చేయకుండా సంబరాలు చేసుకోవడాన్ని వామపక్షపార్టీలుగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 15న జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీ నేతలు

ప్రధాని పర్యటనకు పకడ్బంధీ భద్రత

- సమీక్షించిన డిఐజి, కలెక్టర్, ఎస్‌పి సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈ నెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. గురువారం కర్నూలు, ఓర్వకల్లు మండలం, నన్నూరు దగ్గర ఉన్న రాగమయూరిలో బహిరంగ సభ ప్రాంతం దగ్గర ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి సెక్టారుకు ఇంచార్జులుగా , భద్రతా పర్యవేక్షణ అధికారులుగా పోలీసు ఉన్నతాధికారులు ఉంటారన్నారు. సిఐలు, ఎస్ఐలు, లైజనింగ్ ఆఫీసర్లుగా ఉంటారన్నారు. భద్రతా పరంగా ఎటువంటి లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. అధునాతన సాంకేతికత పరిజ్ఞానం వినియోగించాలన్నారు. అనంతరం హెలిప్యాడ్ ప్రాంతాలు, వివిఐపి కాన్వాయ్ పర్యటించే ప్రాంతాలు, వివిఐపి గ్యాలరీలు, పబ్లిక్ గ్యాలరీలను జిల్లా ఎస్‌పి పరిశీలించారు. అడిషనల్ ఎస్‌పిలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డిఎస్‌పిలు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిఐలు, ఆర్ ఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న కర్నూలు రేంజ్ డిఐజి కలెక్టర్, ఎస్పీ

బీహార్‌లో బిజెపికి ఓటమి తప్పదు

-కాంగ్రెస్ ఇంచార్జ్ గణేష్ కుమార్ యాదవ్ -జిల్లా పార్టీ నేతలతో సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బీహార్లో బిజెపికి ఓటమి తప్పదని ఎఐసిసి కార్యదర్శి ఎపి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి గణేష్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం కర్నూలులోని స్థానిక డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. గణేష్ కుమార్ యాదవ్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ మాట్లాడారు. జిఎస్‌టి పన్నుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. బీహార్ ఎన్నికల నేపథ్యంలో జిఎస్‌టి పన్నుల భారాన్ని తగ్గించారన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులను కార్యకర్తలను కోరారు. సమన్వయంతో ముందుకు వెళ్లి పార్టీ అభివృద్ధికి దోహద పడాలన్నారు. అనంతరం నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించి నాయకుల అభిప్రాయాలు పార్టీకి అభివృద్ధికి చేపట్టవలసిన సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డిసిసి అధ్యక్షులు, జె. లక్ష్మీనరసింహ యాదవ్, మాజీమంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఎం.నాగ మధు యాదవ్, మాజీ డిసిసి అధ్యక్షులు కె.బాబురావు, నియోజక వర్గాల కోఆర్డినేటర్లు , మండల కాంగ్రెస్ అధ్యక్షులు నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఉల్లి రైతును ఆదుకోవాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం, ఉల్చాల గ్రామంలో ఉల్లి పంట వేసిన కౌలు రైతు పాండురంగారెడ్డిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉల్చాల గ్రామంలోని పాండురంగారెడ్డి గొర్లకు వదిలేసిన తన రెండున్నర ఎకరాల ఉల్లి పంటను జి రామకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పరిశీలించారు. రామకృష్ణ మాట్లాడుతూ పాండురంగారెడ్డి రెండున్నర ఎకరాలు అదే గ్రామానికి చెందిన కారం రెడ్డి పొలం కౌలుకు తీసుకొని ఉల్లి సాగు చేశారన్నారు. పంట దిగుబడి వచ్చినప్పటికీ మార్కెట్లో సరైన ధర లేక నిండు పొలాన్ని గొర్లకు మేపడానికి ఇచ్చినట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో 45 వేల ఎకరాలు ఉల్లి పంట సాగు చేయగా ఒక ఎకరాకు 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, ధర లేకపోవడంతో ఉల్లి పంట వేసిన రైతు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.1200 ఇస్తానని ప్రకటించి మాట తప్పిందని, ఎకరాకు రూ.20000 మాత్రమే ఇస్తానని చెబుతున్నట్లు చెప్పారు. ఇది రైతులను మోసం చేయడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. పాండురంగారెడ్డి లాంటి రైతులు జిల్లాలో అనేకమంది ఉన్నారని కొంతమంది తమ పంట పొలాన్ని పూర్తిగా దున్నేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉల్లి రైతుల అర్ధనాదాలు అర్థం చేసుకుని రైతులకు అందరికీ క్వింటాలకు రూ.2500 మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాపారస్తులు తీసుకున్న లోతక్కువకు బోనస్ రూపంలో క్వింటాల్కు రూ.2500 వచ్చే విధంగా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉల్లి రైతులను సంఘటిత పరిచి రాబోయే కాలంలో ఉల్లి రైతులకు న్యాయమైన ధర, ఎసి గోడౌన్లు నిర్మించి కనీస సౌకర్యాలు కల్పించేందుకు, గ్రామ గ్రామాన గోడౌన్లు నిర్మించాలని వ్యాపారస్తుల సిండికేటును అరికట్టాలని పోరాడేందుకు 13న ఉదయం 10 గంటలకు కార్మిక దర్శక భవన్‌లో ఉల్లి రైతుల సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సుకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఉల్లి రైతులందరూ రాజకీయాలకతీతంగా హాజరై డిమాండ్లను సాధించుకోవాలన్నారు.



స్థానిక సమస్యలు పట్టని పాలకమండలి

- నిర్లక్ష్యం చేస్తుంన్న కూటమి ప్రభుత్వంపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని మూడవ వార్డు పరిధిలో గల బండి మెట్టలో స్థానిక సమస్యలు పరిష్కరించడంలో పాలకులు ఘోరంగా వైఫల్యం చెందారని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎం డి షరీఫ్, షేక్ క్షావలి, రాజేంద్రబాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఎం ప్రజల వద్దకు సిపిఎం అనే కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాయకులు వార్డు పర్యటన చేశారు. స్థానిక ప్రజలు అనేక రకాల సమస్యలు నాయకుల దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా కటిక వీధి 1 , 2 సందులలో సరిపడా తాగునీరు రావడంలేదన్నారు. నీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని అక్కడక్కడ ప్రజలు తెలియజేశారు.సామూహిక పురుషుల మరుగుదొడ్లు మహిళలకు వేరువేరు ఉన్నప్పటికీ ఉపయోగములో లేవన్నారు. రెండో, మూడో బేసిన్‌లు మాత్రమే పనిలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల ట్యాంకుకు చిల్లులు పడడం వల్ల నీరు నిలువ ఉండకుండా కారిపోతున్నాయని , రిపేరుచేయాలి లేదా కొత్తగా ట్యాంక్ అమర్చాలని వారు డిమాండ్ చేశారు. డోర్లు విరిగిపోయినాయి అని బాత్రూంలో ఉండే కులాయిలు కూడా విరిగిపోవడంతో అక్కడ వాష్ రూమ్‌లకు నీరు లేవన్నారు. కనీసం ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో నగర పాలక మండలి, కమిషనర్, కూటమి ప్రభుత్వం కలసి ఘోరంగా వైఫల్యం చెందారని విమర్శించారు. మరుగుదొడ్లకు సంబంధించి అనేక మార్లు కమిషనర్, మేయర్ సచివాలయ సిబ్బందికి , ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మరుగుదొడ్ల వ్యవహారం వుందన్నారు. బండి మెట్ట ప్రాంత వాసులకు ఇళ్ల స్థలాలు, ఇవ్వాలని ఐదు లక్షల నుంచి పది లక్షల దాకా రుణాలు ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేశారన్నారు. బండి మెట్ట లో ఉన్న మూడు బోరింగ్ లు చెడిపోయాయని, పలుమార్లు అధికారులకు తెలిపినప్పటికీ ఏం మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. తక్షణమే బండిమెట్టలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పరిష్కారం చేయకపోతే ప్రజలను సమీకరించి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు..



- సిపిఎం నాయకులకు సమస్యలు వివరిస్తున్న స్థానిక మహిళలు

పెరుగుతున్న మానసిక రోగులు

-మూఢనమ్మకాలు, బెట్టింగులు, మొబైల్ ఫోన్ ప్రధాన కారణం

-న్యూరోసైక్యాట్రిస్ట్ డాక్టర్ కె.కంచర్ల హరిప్రసాద్- నేడు మానసిక ఆరోగ్య దినోత్సవం



ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మూఢనమ్మకాలు, ఆన్‌లైన్ బెట్టింగులు, సెల్‌పోన్ల వలన మానసిక రోగులు ఎక్కువతున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం అనేది ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న నిర్వహించే ఒక ముఖ్యమైన ఆరోగ్య అవగాహన కార్యక్రమం. ఒకరి జీవితంలో, సమాజంలో మానసిక ఆరోగ్యం ప్రాముఖ్య తను ప్రోత్సహించడానికి, అవగాహన కల్పించడానికి ఈ రోజు నిర్వహిస్తారు. ప్రతి మనిషికి అన్ని అంశాలలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడం ఈ రోజు లక్ష్యం. అందులో భాగంగా మానసిక వారోత్సవాన్ని ఈనెల 4 నుంచి 10 వరకు నిర్వహిస్తున్నారు.' అని న్యూరో సైక్యాట్రిస్ట్ డాక్టర్ కె.కంచర్ల హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయన మాటల్లో.....

ఈ సంవత్సరం 2025, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఇతివృత్తం 'సేవలకు ప్రాప్యత -విపత్తులు అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యం. ప్రకృతి వైపరీత్యాలు, సంఘర్షణలు, ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులు వంటి సంక్షోభాల సమయంలో మానసిక ఆరోగ్య మద్దతును బలోపేతం చేయడం , అందుబాటులో ఉన్న సేవలను నిర్ధారించడం తక్షణ అవసరాన్ని ఈ థీమ్ హైలైట్ చేస్తుంది.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం చరిత్ర


ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని మొదటిసారిగా 1992 అక్టోబర్ 10న వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ నిర్వహించింది. ఇది 150 కంటే ఎక్కువ దేశాలలో ఉనికిని కలిగి ఉన్న ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ. ఈచొరవను 1992లో వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ రిచర్డ్ హంటర్ ప్రతిపాదించారు. 1994 వరకు ఈ దినోత్సవాన్ని ఎటువంటి నిర్దిష్ట ఇతివృత్తాలు లేకుండా జరుపుకున్నారు. ఇది ప్రధానంగా మానసిక ఆరోగ్యం సాధారణ సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టింది. తరువాత 1994లో, అప్పటి ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య కార్యదర్శి యుజీన్‌బ్రాడీ సూచనల ఆధారంగా, 1994 సంవత్సరానికి 'ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరచడం' అనే ఇతివృత్తం ఆధారంగా ఈ దినోత్సవాన్ని జరుపుకున్నారు. అప్పటి నుండి, మానసికంగా ప్రభావితమైన వ్యక్తులకు మెరుగైన అవకాశాన్ని కల్పించడానికి మానసిక ఆరోగ్య సమస్యలు, వాటి నివారణలు , మద్దతుల గురించి ప్రజలను ప్రోత్సహించడానికి, అవగాహన కల్పించడానికి వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఒక ప్రత్యేక ఇతివృత్తాన్ని ప్రకటించింది. కొన్ని ముఖ్యమైన సంకేతాలలో నిద్ర , తినే విధానాలలో మార్పులు, నిరంతర విచారం, సంఘవిద్రోహ ప్రవర్తన , మానసిక స్థితి మార్పులు ఉన్నాయి.

మూఢనమ్మకాల ప్రభావం : ప్రస్తుతం మన దేశంలో 40 నుంచి 45 శాతం మానసిక వ్యాధిగ్రస్తులు ఉన్నారు. దయ్యాలు ఉన్నాయని ఎంతమంది నమ్ముతారనే సర్వేలో వెల్లడయిన అంశాలను పరిశీలిస్తే రూరల్ ఏరియాలో 72 శాతం నమ్ముతారు. అదే అర్బన్‌లో 67 శాతం నమ్ముతారు. దయ్యాలు మనిషి ఒంట్లోకి వస్తాయని నమ్మేవారు రూరల్‌లో 67 శాతం ఉన్నారు. అర్బన్‌లో 57 శాతం ఉన్నారు. వీటి వలన భయాందోళన, అనుమానం, ఒసిడి , పోబియా వాటికి ప్రధానంగా మూఢనమ్మకాలు ప్రభావం చూపుతాయి. పదోతరగతిలో 9.9 మార్కులు వచ్చిన వాడిపై కూడా దేవుడి కరుణ ఉందని నమ్మితే తనకు ఉన్న ప్రావీణ్యతకంటే ఏదో అతీత శక్తి నడుపుతుందని నమ్మే వాళ్లున్నారు. ఇండియా టీం ప్రత్యర్థి టీంపై గెలిచినప్పుడు టివి చూసే వ్యక్తి టీం సభ్యులు రెడ్ టీషర్టు వేసుకున్నారని గమనించి మరుసటి రోజు రెడ్ టీ షర్టు వేసుకుని కనిపిస్తాడు. మహిళలు మూఢనమ్మకాలకు ఎక్కువ గురవుతారు. పెళ్లయిన తరువాత ఎక్కువ మంది మూఢనమ్మకాలను నమ్మేవారున్నారు. కొత్తగా పెళ్లయిన ఇంట్లో అత్తకో,మామకో ఏదో ప్రమాదం జరిగితే కొత్తగా ఇంటికి వచ్చిన కోడలే కారణమనే వారున్నారు. అది భర్త కూడా నమ్మితే ఆమహిళ ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉంది. అందుకే రాజ్యంగంలోని ఆర్టికల్ 51 శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించాలని చెబుతుంది. అయినా ఇప్పటికీ స్వాములు, బాబాలు చెప్పే మాటలు నమ్మే వాళ్లున్నారు. మూఢనమ్మకాలను ఎందుకు నమ్ముతారంటే మనిషి కోతి నుంచి మనిషిగా మారినప్పుడు పరిణామ క్రమం అర్థం కానప్పటి ఉంచి వర్షం, సూర్యచంద్రులను అతీత శక్తులుగా నమ్ముతారు.

కనురెప్పలు ఎందుకు అదురుతాయనేది చాలా మందికి తెలియదు. క్యాల్సియం, మెగ్నీషయం శరీరంలో తగ్గినప్పుడు అదురుతాయి. కాని దానిని అపశకునాలని పేరు పెడుతారు. అందుకే ఇప్పటికీ ప్రతి ముగ్గురిలో ఒకరు మానసిక వ్యాధి బారిన పడుతున్నారు. కరోనా తరువాత ఇవి మరీ పెరిగాయి.

మొబైల్ ఫోన్ల ద్వారా: మొబైల్ ఫోన్లు వాడకం చిన్నపిల్లలో 2019 నుంచి 2025 మంధ్య 5 నుంచి 8రెట్లు పెరిగాయి. ఇది వాడితే బ్రెయిన్ కెఫాసిటీని తగ్గిస్తుంది. తెలివితేటలు ఉపయోగించక పోవడం, కోపతాపాలు పెరుగుతున్నాయి. నిద్రలేమి వంటి వస్తున్నాయి. రూ.ఒక లక్ష సంపాధించే వాడి ఆదాయం రూ.10 వేలకు పడిపోతుంది.

బెట్టింగులు : బెట్టింగ్అనేది అత్యంత భయంక రమైన మానసిక జబ్బులకు దారి తీస్తుంది. కోట్లలో బెట్టింగుల్లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మ హత్యలకు దారితీసే పరిస్థితులు న్నాయి. చిన్నపిల్లల్లో ఎడిహెడి (అట్టెన్షన్ డిఫెక్ట్ హైపరాక్టివిటీ డిసార్డర్) ఉన్నప్పుడు వారిలో పెద్దగయ్యాక పొగతాడం, మద్యం సేవించడం వంటి వ్యసనాలకు బానిసయ్యే గుణం పెరుగు తుంది. బెట్టింగులను మానసిక వ్యాధిగా గుర్తిం చాలని, దీనిని కూడా వైద్యం ఉంది. మీదగ్గరలోని సైక్రియా టిస్టుతో చూయించుకోవాలి. మూడింటికి మూఢ నమ్మకాలు, మొబైల్‌ఫోన్, బెట్టింగులకు దూ రంగా ఉంటే మానసిక రోగుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.


మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి

- సెట్కూరు సిఇఒ డాక్టర్ వేణుగోపాల్

ప్రజాశక్తి - కౌతాళం

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి యువత ముందుకు రావాలని సెట్కూరు సిఇఒ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్కూరు ఆధ్వర్యంలో కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మత్తుపదార్థాలు వ్యసనం – పర్యావసానాలు, సైబర్ క్రైమ్' అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వల్ల దేశంలో ప్రతేడాది దాదాపు 1.4 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. సమాజం ఎదుర్కొంటున్న కీలక సమస్యల్లో డ్రగ్స్ వాడకం ఒకటని, పెరుగుతున్న ఆధునిక జీవన శైలి, ఒత్తిడితో చాలా మంది యువత డ్రగ్స్ వాడకానికి బానిసలవుతున్నారని చెప్పారు. డ్రగ్స్ ఉపయోగం వల్ల యువత, సమాజంపై పడుతున్న దుష్ప్రభావాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ బి.రమణ రెడ్డి మాట్లాడుతూ... సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ పి.దేవిడ్ మాట్లాడుతూ... క్రీడలు, హాబీలతో మానసిక ఆనందం పొందాలని తెలిపారు. సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, హెడ్ కానిస్టేబుల్ సోమ్లా నాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

- కెవిపిఎస్ జెండావిష్కరణలో నాయకులు


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కోసిగి

దళితుల సమస్యలు పరిష్కరించేందుకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. గురువారం కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని కందుకూరు, దుద్ది, చిన్న భూంపల్లి, పెద్ద భూంపల్లి గ్రామాల్లో కెవిపిఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల అధ్యక్షుడు ప్రకాష్ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి రామకోటి హనుమంతు మాట్లాడారు. కెవిపిఎస్ పోరాట ఫలితంగానే జస్టిస్ పున్నయ్య కమిషన్, ఎస్సీ సబ్‌ప్లాన్ తదితర విజయాలు సాధించి దళితులకు అండగా నిలబడినట్లు తెలిపారు. డప్పు కళాకారులు, చర్మ కళాకారులు, శ్మశానంలో గుంతలు తీసే కార్మికుల సంక్షేమం కోసం కెవిపిఎస్ పోరాడుతోందని చెప్పారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రామకోటి పెద్ద హనుమంతు, బొజ్జప్ప, జయన్న, వసంత, ముక్కరప్ప, నరసప్ప, ఆంజనేయులు, రామలింగ, వెంకోబ, కందనాతి మరియప్ప, శీను, నాగరాజు, సూరి పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి : సిఐటియు

ప్రజాశక్తి - కౌతాళం

సమస్యల పరిష్కారం కోసం గ్రామ సేవకులు పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య తెలిపారు. గురువారం సిఐటియు కార్యాలయంలో గ్రామ సేవకుల సంఘం సమావేశం నిర్వహించారు. నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామ సేవకులు ప్రభుత్వానికి వెట్టిచాకిరి చేస్తున్నారని, గత టిడిపి ప్రభుత్వం జీతాలు పెంచుతామని చెప్పి, ఐదేళ్ల పాటు ఒక్క పైసా కూడా పెంచలేదని తెలిపారు. గతంలో వైసిపి ప్రభుత్వం జీతాలు పెంచకపోగా డిఎ తీసుకున్న డబ్బులు తిరిగి ఒక్కో గ్రామ సేవకుని దగ్గర రూ.30 నుంచి రూ.35 వేల వరకు కట్టించుకుందని విమర్శించారు. ఈనెల 13, 14, 15వ తేదీల్లో విజయవాడలో దీక్షలు, ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు, అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. గ్రామ సేవకులు నాగరాజు, తాయప్ప, మారెప్ప, వీరేష్, ఈరన్న, జెట్టప్ప, శ్రీనివాసులు, మంగమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

అధిక వర్షాలతో నష్టం..!

- దెబ్బతిన్న మిరప పంట
- నష్టాల్లో రైతులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు మిరప పంటలు దెబ్బతిన్నాయి. మిరప పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు కురిసి పొలాల్లో నీరు నిలిచి మిరప పంట కుళ్లి ఎండిపోయింది. రైతులు నష్టాల్లో మునిగారు.



మండలంలో మిరప పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బావులు, బోర్లు, వర్షాధారం కింద 1000 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. దేవనకొండ, వెలమకూరు, కూకటికొండ, గుండ్లకొండ, కొట్కాల, ఐరన్‌బండ బి సెంటర్, లక్కందిన్నె, తెర్నేకల్లు, బెల్దొనొడ్డి, పుల్లాపురం, పల్లెదొడ్డి, గద్దెరాళ్ల, పొట్లపాడు, జంబులపల్లి, బేతపల్లి, పి.కోటకొండ తదితర గ్రామాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మిరప పంట సాగుకు మిరప విత్తనాలు, నాటు, పొలం దున్నకాలు, కలుపులు, రసాయనిక, క్రిమిసంహారక మందులు మొత్తం కలిపి ఎకరాకు రూ.70 వేల దాకా పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు కురిసి పంట కుళ్లి ఎండిపోయింది. పంట కోసం పెట్టిన పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితులు లేవని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మిరప రైతులు కోరుతున్నారు.

రెండెకరాల్లో పంట నష్టపోయాను

– అబ్బాకర్, దేవనకొండ



మూడెకరాల్లో మిరప పంట సాగు చేశాను. అధిక వర్షాలతో రెండెకరాల్లో వర్షపు నీరు నిలిచి పంట కుళ్లి ఎండిపోయింది. మిరప సాగు కోసం సుమారు రూ.2.50 లక్షలు ఖర్చు చేశాను. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

– బంగి మారెన్న, దేవనకొండ



నేను 2.80 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిరప పంటను సాగు చేశాను. అధిక వర్షాలతో 1.50 ఎకరాల పొలం నీరు నిలిచి దెబ్బతిన్నది. అధిక వర్షాలతో పంట కుళ్లి ఎండిపోయింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షపు నీటితో కూలిపోయింది. పొలం కౌలు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదు. నష్టపోయిన మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

మృత్యువులోనూ వీడని బంధం

– రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి

ప్రజాశక్తి - ఆస్పరి


మహేష్ (ఫైల్)


శ్రీనివాసులు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి చెందిన సంఘటన గురువారం ఆస్పరి మండలంలో చోటు చేసుకుంది. తన కుమారుని ఉన్నతంగా చదివించాలని ఎంతో సంతోషంగా పాఠశాలకు తీసుకెళ్తుండగా బిల్లేకల్లు గ్రామం వద్ద లారీ రూపంలో తండ్రి, కొడుకులను మృత్యువు కబళించింది. హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ వివరాల మేరకు... క్రిష్ణగిరి మండలం పోతుగల్ గ్రామానికి చెందిన మాల దాసరి మహేష్ (45) కుమారుడు మాల దాసరి శ్రీనివాసులు (14) ఆలూరు 'గాయత్రి మార్కెట్ సమీపంలో బళ్లారి, కర్నూలు ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా బళ్లారి నుంచి కర్నూలుకు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి స్కూటర్‌పై నుంచి దూసుకెళ్లింది. బాలుడు మాల దాసరి శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి మాల దాసరి మహేష్ రెండు కాళ్లు విరిగాయి. వెంటనే స్థానికులు 108కి సమాచారం ఇచ్చి అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మహేష్‌కు భార్య రామేశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి. మృతుని భార్య రామేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు.

రైతు సమస్యలపై పోరాటం

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు దశరథ రామిరెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి కోసం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని, అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా పంట కాలువల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు దశరథ రామిరెడ్డి, జిల్లా కన్వీనర్ శేషాద్రి రెడ్డి తెలిపారు. గురువారం దేవనకొండ క్రాస్ రోడ్డులోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాలులో సాగునీటి వనరులపై రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పందికోన రిజర్వాయర్, కుడి, ఎడమ కాలువల పరిధిలోని మాచాపురం, బండగట్టు, నెల్లిబండ, వెలమకూరు, కూకటికొండ గ్రామాల్లో పర్యటించి పంట కాలువలను పరిశీలించామన్నారు. పందికోన రిజర్వాయర్ నుంచి పత్తికొండ, దేవనకొండ మండలాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యం నీరుగారి పోయిందని తెలిపారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నిధుల కేటాయింపు జరగక పంట కాలువలు ముళ్లకంపలతో అధ్వానస్థితికి చేరుకున్నాయని చెప్పారు. ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం హంద్రీనీవా పంట కాలువల కోసం రూ.210 కోట్ల ప్రతిపాదనలు పంపామని చెబుతున్నా నిధుల మంజూరు జరగలేదని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వాలు చొరవ తీసుకుంటే తాగు, సాగునీరు అందించవచ్చని చెప్పారు. సాగునీటి సాధన సమితి నాయకులు కాశీ విశ్వనాథ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నారాయణరెడ్డి, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దశరథ రామిరెడ్డి

పెచ్చుల కింద భోజనం.. కాదు సురక్షితం..!

ప్రజాశక్తి - గోనెగండ్ల


భోజనం చేస్తున్న విద్యార్థినులు

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1,750 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినే సమయంలో సరయిన సౌకర్యం లేకపోవడంతో చెట్ల కింద, తరగతి గదుల ఆవరణలో ఎవరికి నచ్చిన చోట వారు భోజనం చేస్తున్నారు. గురువారం పాఠశాలలోని పెచ్చులూడిన పాత ప్రధానోపాధ్యాయుల రూమ్ కింద విద్యార్థినులు సామూహికంగా కూర్చొని భోజనం చేశారు. వర్షాకాలం.. పెచ్చులూడిన పాత భవంతి కావడంతో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో 'పెచ్చుల కింద భోజనం.. కాదు మీకు సురక్షితం' అనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది వెంటనే తగిన చర్యలు చేపట్టి విద్యార్థినులు ఆ పాత భవంతి కింద కూర్చోకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యార్థులు ఒక నిర్దిష్టమైన ప్రదేశంలో కూర్చుని భోజనం చేసేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడితే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బదిలీ

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బదిలీ అయ్యారు. శ్రీసత్యసాయి జెసిగా నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మౌర్య భరద్వాజ్ 2022 బ్యాచికి చెందినవారు. ఈయన సేవలు మరువలేనివని ఆదోని డివిజన్ ప్రజలు కొనియాడుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కడుపు నొప్పితో సిపిఎం మండల కమిటీ సభ్యుడు మృతి

- శేఖర్ మృతి పార్టీకి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి



కడుపునొప్పి తాళలేక మండలంలోని ములుగుందం గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి, మండల కమిటీ సభ్యులు శేఖర్ (30) మృతి చెందారు. గురువారం సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడారు. శేఖర్ గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. శేఖర్ పార్టీలో ఎంతో చురుకుగా ఉంటూ కార్యక్రమాలు ముందుండి చేసేవారని చెప్పారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు రంగస్వామి, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు మల్లేష్, రవి, పెద్ద వీరభద్రి, మధు రెడ్డి, ఈరన్న, రవి, ఏసోబు నివాళులర్పించారు. శేఖర్‌కు భార్య హరిత, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

సిసి రోడ్డు, డ్రెయిన్ వేయండి...

- ఎస్సీ కాలనీ వాసుల మొర

ప్రజాశక్తి - గోనెగండ్ల

తమ వీధిలో సిసి రోడ్డు, డ్రెయినేజీ కాలువలు నిర్మించి మురుగు నుంచి కాపాడాలని ఎస్సీ కాలనీవాసులు కోరారు. గోనెగండ్లలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు లేక నీరు నిల్వ ఉండి.. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వ్యాధుల నుంచి తమను కాపాడండని ఎస్సీ కాలనీవాసులు రామక్క, నరసమ్మ కోరారు. గురువారం సిఐటియు, సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో స్థానిక సమస్యల పరిష్కారానికి సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్, నబిరసూల్, నాయకులు బతకన్న, మునెప్ప కాలనీవాసులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు రామక్క, నరసమ్మ మాట్లాడుతూ... తమ వీధిలో సిసి రోడ్డు, డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో నీరు నిలిచి మురుగుతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కాలనీ ఏర్పడి 30 ఏళ్లు కావస్తున్నా గజ్జి రంగన్న ఇంటి దగ్గర నుంచి పక్కీరన్న ఇంటి వైపుగా వెళ్లే దారిలో సిసి రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేయలేదని తెలిపారు. గతంలో వైసిపి నాయకులు 'రోడ్డు వేస్తాం. రాళ్లగుండ్లు తొలగించుకోండి' అని చెప్పడంతో స్థానికులు నిధులు సేకరించుకుని గుండ్లు తొలగించుకున్నామని చెప్పారు. రోడ్డు మాత్రం వేయలేదని వాపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి వచ్చి రోడ్డును పరిశీలించారని, రోడ్డు వేయాలని మండల అధికారులను, నాయకులను, సర్పంచిని ఆదేశించినా వేయలేదని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు, సమీపంలో ఉన్న తాగునీటి సరఫరా ట్యాంకు నుంచి వచ్చే నీరు రోడ్డుపై, ఇళ్ల ముందు నిలిచి దోమలు వ్యాపిస్తున్నాయని, కాలనీలో డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. సర్పంచి, పంచాయతీ కార్యదర్శి స్పందించి ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలను ఏర్పాటు చేసి సిసి రోడ్డు వేయాలని కోరారు. కాలనీవాసులు సునీత, రాజు, నాగమ్మ, అరుణమ్మ, వెంకటమ్మ, మారేష్ పాల్గొన్నారు.




మురుగునీటిని చూపుతున్న కాలనీవాసులు

సుపరిపాలన కాదు.. మోసాల పాలన...

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - నందవరం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సుపరిపాలన కాదని, మోసాల పాలన అని వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక విమర్శించారు. గురువారం మండలంలోని మాచాపురం గ్రామంలో బుట్టా రేణుక, వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ, మండల ఉపాధ్యక్షులు, వైసిపి మాచాపురం నాయకులు కోటేశ్వరరావు అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' విస్తృతస్థాయి సమావేశం, గ్రామ అనుబంధ కమిటీలను నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో కోతలే ఉన్నాయని ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను అరకొరగా అమలు చేసి ప్రజలను మోసం చేశారన్నారు. పింఛన్లలో కోతలు విధించి వికలాంగులకు అన్యాయం చేశారని విమర్శించారు. జగన్ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. కెఆర్.మురారి రెడ్డి, కనకవీడు లక్ష్మి కాంత్ రెడ్డి, ముగతి విరుపాక్షి రెడ్డి, నరహరి రెడ్డి మాట్లాడుతూ... కూటమి నేతలు లిక్కర్ స్కామ్‌లో మునిగారని తెలిపారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా స్వార్థ ప్రయోజనాల కోసం మద్యం కుంభకోణాల్లో మునిగిపోయారని మండిపడ్డారు. సీనియర్ నాయకులు రామకోటేశ్వర్ రెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు సోమల గూడూరు వెంకటేశ్వర రెడ్డి, నియోజవర్గ ప్రచార విభాగం అధ్యక్షులు నది కైరవాడి చాంద్ బాషా, మండల యూత్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్ రెడ్డి, మండల కార్యదర్శి నది కైరవాడి వెంకటేష్, జిల్లా స్టూడెంట్ విభాగం నాయకులు ప్రకాష్ రెడ్డి, నందవరం ఎల్లా గౌడ్, రమేష్ గౌడ్, మీసాల సంపత్ గౌడ్, నాగలదిన్నె మాజీ సర్పంచి ప్రభాకర్, నరసింహులు, ఎంపిటిసి అతావుల్లా, జిల్లా బీసీ నాయకులు హాలహర్వి సావిత్రమ్మ, చిన్న కొత్తిలి సోమన్న, హనుమంతు, మాచాపురం సర్పంచి కిష్టప్ప, సత్యన్న, గాలెన్న, గోపాల్, భీమన్న, దస్తగిరి, మోహన్, శివ, చంద్రశేఖర్ రెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ సారథ్యంలో గోనెగండ్ల మండల అధ్యక్షులు కెవి.కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు గోనెగండ్ల నాగేష్ నాయుడు సమక్షంలో గోనెగండ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. కందనూలు వెంకటేష్, కురువ రవికుమార్, వలుకూరు శివ, కొమ్మల శేఖర్, కురువ శ్రీనివాసులు, కురువ రాముడు, హరిజన సుధాకర్, హరిజన భాస్కర్, కురువ వెంకటేష్, కురువ పరమేష్, మంగలి సోమన్న, హరిజన ప్రవీణ్, బోయ విష్ణుకుమార్, హరిజన చిన్న దుబ్బన్నతో పాటు 51 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వైసిపి సీనియర్ నాయకులు మురారి రెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన 30 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వచ్చిన రూ.17,76,921 చెక్కులను పంపిణీ చేశారు. **మంత్రాలయం** మండలంలోని మాధవరం గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలో ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, టిబి ఎల్ఎల్‌సి కర్నూలు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్సిరెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మంత్రాలయం మాజీ జడ్‌పిటిసి ఆర్.లక్ష్మయ్య, ఐటిడిపి మండల అధ్యక్షులు బి.రామకృష్ణ పాల్గొన్నారు.


ఆదోనిలో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


మంత్రాలయం : చెక్కులు పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

'కర్ణాటక మద్యం రవాణాపై ఉక్కు పాదం'

ప్రజాశక్తి - ఆదోని



కర్ణాటక మద్యం రవాణా చేసినా, విక్రయించినా ఉక్కుపాదం మోపుతామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. దాడుల్లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం, రెండు బైకులను గురువారం మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌతాళం మండలం బుడుములదొడ్డి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని తెలిపారు. తనిఖీ చేస్తుండగా తిమ్మాపురం గ్రామానికి ముకయ్య, చిరుతపల్లి గ్రామానికి చెందిన వీరేష్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, 12 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఘటనలో మరో వ్యక్తి చిరుతపల్లి గ్రామానికి చెందిన తలారి హుస్సేనిపై కేసు నమోదు చేశామన్నారు.

క్రీడలు విద్యార్థుల భవితకు బాటలు

- ఎంపిడిఒ మణి మంజరి

ప్రజాశక్తి - గోనెగండ్ల


క్రీడలు విద్యార్థుల భవితకు బాటలని ఎంపిడిఒ మణిమంజరి, ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠ తెలిపారు. గురువారం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువులో రాణిస్తూనే క్రీడల్లో పాల్గొనడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం పెంపొంది దృఢంగా ఉంటారని ఎతలిపారు. నచ్చిన క్రీడలో ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనడం ద్వారా ముమ్ముందు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చని చెప్పారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు అన్ని రకాలుగా కృషి చేసిన పీడీ ఎన్.జాకీర్ హుస్సేన్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఒ రామాంజనేయులు

'రాయరభీమా'లో పీఠాధిపతుల పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాయర భీమా రెసిడెన్సి లాడ్జిలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర ఆహ్వానం మేరకు 16 రూములతో నూతనంగా నిర్మించిన లాడ్జి వద్దకు చేరుకున్న ఆయనకు బాణ సంచా పేల్చి పూలమాల వేసి పుష్పాభిషేకంతో స్వాగతం పలికారు. పీఠాధిపతులు రాఘవేంద్రస్వామి చిత్రపటానికి పండితుల వేద మంత్రాల మధ్య విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. వైసిపి నాయకులు గోర్కల్ కృష్ణస్వామి పాల్గొన్నారు.


లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న పీఠాధిపతులు

బోధనేతర పనులు వద్దు : ఫ్యాప్టో

ప్రజాశక్తి - హొళగుంద

ఈనెల 10 నుంచి బోధనేతర పనులు, విద్యా శక్తి కార్యక్రమం బహిష్కరించేందుకు మండల ఉపాధ్యాయులు గురువారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఇఒ కబీర్ సాబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఎస్.పోతురాజు, జి.దొడ్డ బసప్ప మాట్లాడారు. బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులను బోధన నుంచి దూరం చేస్తున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని చెప్పారు. నాయకులు లాలు స్వామి, డి.పాండురంగ, మౌలాలి, వై.వెంకటేష్, ప్రభాకర్, ఎం.ధనుంజయ, ఎస్.ఈరన్న, బిటి.ఖలందర్, జె.శేఖరప్ప, బి.గాదిలింగప్ప పాల్గొన్నారు.

నిద్రమత్తులో ఎమ్మెల్యే పార్థసారథి

- వైసిపి రాష్ట్ర కార్యదర్శి మహేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం/ఆదోని



కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 16 నెలలవుతున్నా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి నిద్రమత్తులో ఉన్నారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి మహేంద్ర నాథ్ రెడ్డి విమర్శించారు. గురువారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఎన్నికల ముందు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పరిచయాలు ఉన్నాయని బీరాలు పలికి, ప్రస్తుతం ఆదోని పట్టణాన్ని అభివృద్ధి చేయలేక కేవలం మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డిపై విమర్శలు చేయడానికే పరిమితం కావడం సిగ్గుచేటని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పట్టణానికి రెండు బైపాస్ రోడ్లు, మెడికల్ కాలేజ్, సిసి రోడ్లు తెచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. గురువారం స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తులకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించి, వారి సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్ ఆధ్వర్యంలో బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు.

స్వర్ణమయమైన మూల బృందావనం : మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచ రథాల్లో ఊరేగిన రాఘవేంద్రులు : రాఘవేంద్రస్వామి పంచ రథాల్లో ఊరేగి భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి వారికి రథోత్సవ సేవలు చేయించిన భక్తులతో సంకల్పం చేయించి, అనంతరం ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులను వెండి గజ వాహనంలో, కొయ్య, వెండి, స్వర్ణ, నవరత్న స్వర్ణ రథాల్లో ఆశీనులు చేసి, పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పుష్పార్చనతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తజన సందోహం మధ్య వైభవంగా పంచ రథోత్సవాలను ఊరేగించారు. శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

వైసిపి కనీసం పిల్లకాల్వనైనా తీసిందా?

-సీమ అభివృద్ధి కోసం నిలబడిన టిడిపి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వైసిపి తన అధికారంలో జిల్లాలో కనీసం పిల్ల కాలువైనా తీసిందా అని టిడిపి నాయకులు అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న హోటల్‌లో కోడుమూరు నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కోడుమూరు నియోజకవర్గం రామలింగేశ్వర్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి, కెడిసిసిబి చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... కోడుమూరు నియోజకవర్గంలో టిడిపి గెలుపు చరిత్రగా నిలిచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాయలసీమ అభివృద్ధిలో ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు కృషి ఎనలేనిది అన్నారు. సీమ అభివృద్ధి కోసం రాయలసీమ డెవలప్మెంట్ మిషన్‌ను ప్రారంభించారన్నారు. సీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చుదిద్దనున్నారన్నారు. సాగు తాగు నీటి ప్రాజెక్టుల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. రాబోయే కాలంలో



-బీద రవిచంద్రతో టిడిపి నాయకులు, ఎమ్మెల్యే లు

రాయలసీమలో వైసిపి కనుమరుగవనుందన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారందరికీ పార్టీ తప్పక న్యాయం చేస్తుందన్నారు. అనంతరం వారు కార్యకర్తలతో కలిసి ఈనెల 16న నన్నూరు సమీపంలో ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించనున్న సభ ఏర్పాట్లను పరిశీలించారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మందులు, వైద్య పరికరాలపై తగ్గిన ఆంధ్రప్రదేశ్ సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం ఆసుపత్రి అడిషనల్ డిఎంఇ సూపరిండెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ , ధన్వంతరి కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి ఇంచార్జి ఎస్‌ఆర్‌ఎంఒ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు, తక్కువ జిఎస్‌టి విధానాన్ని ప్రవేశపెట్టడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. వైద్య అవసరాలకు ఉపయోగించే ఆక్సిజన్ ధర సర్జికల్ పరికరాలు, డయాగ్నొస్టిక్ టూల్స్, ఆర్థోపెడిక్ పరికరాలు వంటి వాటిపై పన్ను తగ్గడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్య , జీవిత బీమా పాలసీలపై జిఎస్‌టి తగ్గడంతో రోగులకు వైద్య ఖర్చులు తగ్గుతాయన్నారు. సూపర్ జిఎస్‌టి ద్వారా వైద్య పరికరాలు మందులు కొనడానికి ప్రజలకు ధరలు తగ్గుదలతో



మాట్లాడుతున్న హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం

వైద్య పరికరాలు , రోగ నిర్ధారణ కిట్లపై పన్ను తగ్గించడం వల్ల ఆసుపత్రులు ,రోగులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. మందుల ధరలు తగ్గుదలతో అత్యవసర ప్రాణాధార మందులపై జిఎస్‌టిని తగ్గించడం వల్ల రోగుల వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. డిప్యూటీ సిఎస్‌ఆర్‌ఎంఒ డాక్టర్ పద్మజ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివ బాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్, మెడికల్ స్టోర్ ఆఫీసర్, డాక్టర్ శారద, నర్సింగ్ సూపరిండెండెంట్, సావిత్రిబాయి, ఆసుపత్రి సిబ్బంది నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రత వసతి గృహ అధికారులదే

-ఆరోగ్యం, భద్రతపై దృష్టి సారించాలి

- జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి బి.రాధిక

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థుల భద్రత బాధ్యత స్థానిక వసతి గృహ అధికారులదే అని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి బి.రాధిక అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని స్థానిక సంక్షేమ భవన్‌లో ఉన్న జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల భద్రతా చర్యలపై ఏ ఎస్‌డబ్ల్యుహెచ్ డబ్ల్యుఓలతో కలిసి సమీక్షా సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో భద్రతా చర్యలు, బడ్జెట్ వ్యయ వివరాలు, అనుచిత సంఘటనల నివారణ, ఇన్‌స్పెక్షన్ రిపోర్టులు, అడ్మిషన్ వివరాలు, మౌలిక వసతులు / భద్రతా పరిస్థితులు, సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలు వంటి పలు కీలక అంశాలపై ఆమె చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం అధికారులు హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, హాస్టల్ పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని అన్నారు. దోమల నియంత్రణ కోసం పర్యాయంగా ఫాగింగ్, మందు పిచికారీ చేయించాలన్నారు. తాగునీరు మరిగించి లేదా శుద్ధి చేసి ఇవ్వాలని చెప్పారు. ఆహార పదార్థాలు పరిశుభ్రంగా వండి అందించాలని, విద్యార్థులు శుభ్రమైన దుస్తులు ధరించేలా, దోమతెరలు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా విద్యార్థికి జ్వరం లేదా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య



- మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి బి.రాధిక

కేంద్రం కి సమాచారం ఇచ్చి చికిత్స చేయించాలన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫస్ట్ ఎయిడ్ కిట్, ప్రాథమిక మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్య విభాగంతో సమన్వయం చేసుకుని నియమిత ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు హైజీన్, హెల్త్ పోస్టర్లు ప్రదర్శించాలని, జిల్లాలోని అన్ని హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షిత, ఆరోగ్యకర వాతావరణం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బదిరుల కోసం ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ :అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలకు సంబదించి సాంకేతికి లోపాలు లేకుండా మానవ హక్కులు లేవు అనే అంశంపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా జిల్లా అసంక్రమిత వ్యాధుల కార్య నిర్వాహణ అధికారి డాక్టర్ ఎన్.మహేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ బధిరులు కూడా సామాన్యులే వారు కూడా ఇతరుల్లాగే భావనలు, అభిరుచులు, అవసరాలు కలిగిన వ్యక్తులేనన్నారు. మౌనత వల్ల మాత్రమే వారి సామర్థ్యాన్ని అంచనా వేయకండని వారికి కూడా సరైన కమ్యూనికేషన్ అవసరమన్నారు.బధిరులతో మాట్లాడేటప్పుడు ముఖాన్ని చూస్తూ, స్పష్టంగా మాట్లాడాలని అన్నారు. వారికీ రాయడం, చూపించడం, మొబైల్ లేదా ఇతర టెక్నాలజీ ఉప యోగించడం ద్వారా కూడా కమ్యూనికేషన్ చేయవచ్చని తెలిపారు. డిఐఇసి మేనేజర్ ఇర్ఫాన్ షేక్ మాట్లాడుతూ వారి వ్యక్తిత్వాన్ని గౌరవించండి, వారిని బాధ్యత లేని వారు అని కాకుండా, సంపూర్ణ వ్యక్తులుగా చూడాలన్నారు. వారు సహా యం అడిగినపుడే సహాయం చేయాలని, అవసరం లేనప్పుడు తప్పకుండా జోక్యం అవసరంలేదని వివరించారు. పిల్లల వైద్యులు డాక్టర్ సృజన మాట్లాడుతూ వివక్షను తగ్గించాలి, బధిరుల పట్ల అపార్థాలు లేదా తప్పుదిద్దుబాట్లను నివారించండం, వారి పట్ల వినయంగా, గౌరవంగా వ్యవహ రించడం, అందరితో సమాన అవకాశాలు కల్పించా లన్నారు. విద్య, ఉద్యోగం, ప్రజాసేవల్లో బధిరులకూ సమాన అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో సౌకర్యాలు, అనువాదాలు ఉండేలాగా చూసు కోవాలని తెలిపారు. ఆడియాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్ రాజేశ్వరి మాట్లాడుతూ సిగ్న్ లాంగ్వేజ్ నేర్చుకోవడాన్ని ప్రోత్సహించా లన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఆర్‌కెఎస్‌కె. కన్సల్టెంట్ మల్లికార్జున, దంతవైద్యులు డాక్టర్ లక్ష్మీ రెడ్డి, ఫిజియోథెరపిస్ట్, పిల్లలమనస్తత్వవేత్తలు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ‘ జిఎస్‌టి 2.0 అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె. వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆయన జిఎస్‌టి పన్ను తగ్గింపుతో సమాజానికి, వివిధ సంస్థలకు, చిన్న వ్యాపార సంస్థలకు కలిగే లాభాలను వివరించారు. విద్యార్థినులు భవిష్యత్తులో పన్ను వ్యవస్థ, అకౌంటింగ్, వ్యాపార రంగాల్లో పొందగల అవకాశాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి వి.రంగారెడ్డి, డాక్టర్ బి.నికిత, డాక్టర్ కీర్తి కుమారి, డాక్టర్ సాహిత్య, డాక్టర్ వై.నూర్ భాష, విజయలక్ష్మి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాఖలో సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

డిసెంబర్ నెల 31 జనవరి 1, 2, 3, 4 వ తేదీలలో విశాఖపట్నంలో జరుగనున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో షరీన్ నగర్ మట్టిపని మేస్త్రి కార్మికుల సమావేశం కె.దాసు అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె. సుధాకరప్ప నగర సహాయ కార్యదర్శి జి ఏసు మాట్లాడారు. కార్మికులు తమ శ్రమను ధారపోసి దేశం అభివృద్ధి కోసం కష్టపడుతుంటే ప్రస్తుత ప్రభుత్వాలు వారి శ్రమను గుర్తించకుండా శ్రమ దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ఎనిమిది గంటల పనిని 13 గంటలకు పెంచుతూ తీర్మానం చేసిందంటేనే కార్మికుల పట్ల పాలకులకు ఎలాంటి చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందన్నారు. ఆదాని అంబానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేయడానికి ఈ చట్టాలు చేస్తున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో రామాంజనేయులు, జి.వెంకటేశ్వర్లు, వి కిషోర్, టి.శ్రీనివాసులు, మరియమ్మ, శాంతమ్మ, లక్ష్మీదేవి, రమాదేవి, సరోజమ్మ, శేషమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



వైద్య ఖర్చులపై జిఎస్‌టి తగ్గింపు

ప్రజాశక్తి-పత్తికొండ..

పేదల ఆరోగ్య వైద్యుల ఖర్చుల పై జిఎస్‌టి తగ్గింపు జరిగిందని పత్తికొండ సూపరెండెండ్ డాక్టర్ కల్పన అన్నారు. గురువారం పత్తికొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లోని డాక్టర్లు సూపర్ జిఎస్‌టి – సూపర్ సేవింగ్ పై రోగులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ఆస్పత్రి కమిటీ మెంబర్ బత్తిని లోకనాథ్, శ్రీరామ హాస్పిటల్ ఎండి నీలకంఠ పాల్గొని మాట్లాడారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజా ఆరోగ్య వైద్య సేవలపై జిఎస్‌టి తగ్గింపుతో పాటు మెడికల్ ఖర్చులు తగ్గించిందని అన్నారు. భీమా సేవలు గతంలో 18 శాతం నుండి సున్నా శాతం, అంతేకాకుండా మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్ గతంలో 12 శాతం ఉంటే 5 శాతానికి తగ్గింపు జరిగిందన్నారు. మెడికల్ ఏజెన్సీ సభ్యులు నాగరాజు, బొంతుల రంగా, కౌలుట్లయ్య, ఎల్‌ఐసి బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్, సామాజిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది దేవయ్య, భూషయ్య, సౌమ్య పాల్గొన్నారు.

తపాల వ్యవస్థను ఐక్యంగా కాపాడుకోవాలి

ప్రజాశక్తి -కోడుమూరు

మండల కేంద్రంలోని స్థానిక నాగార్జున విద్యానిలయంలో ప్రపంచ తపాలా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి, నాగార్జున విద్యానిలయం కరస్పాండెంట్ నాగార్జున యాదవ్ పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఎద్దుల మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తపాలా వ్యవస్థ అంతరించి పోకుండా ప్రతి ఒక్కరు కలిసి కాపాడుకోవాలన్నారు. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 9న జరుపుకుంటారు, ఇది ప్రపంచవ్యాప్తంగా తపాలా సేవల ప్రాముఖ్యతను, వాటి సామర్థ్యా న్ని తెలిపే రోజు. 1874లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ స్థాపన వార్షికోత్సవం సందర్భంగా 1969లో దీనిని ప్రకటించారు .ఇంటర్నెట్ , తక్షణ సందేశ సేవల యుగంలో, పోస్టల్ సేవలు కొంచెం వాడుకలో లేనట్లు అనిపించవచ్చు. ఒక ప్రాంతం యొక్క కనెక్టివిటీలో పోస్టల్ వ్యవస్థ ఒక ముఖ్యమైన భాగం అని ఆయన వివరించారు. నాగార్జున యాదవ్ మాట్లాడుతూ పూర్వం మానవులు తపాలా వ్యవస్థను ఎలా ఉపయోగించే వారు పోస్టల్ కార్డును తపాలా బిళ్ల లను విద్యార్థులకు చూపించి దాని యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి , రవితేజ, ఉదయ్, లక్ష్మన్న, వెంకటరమణ, రవి ప్రకాష్ , భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-పత్తికొండ

బోధినేతర పనులు , విద్యా శక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాక్టో నాయకులు భాస్కర్ లోక్య నాయక్ నాగరాజు నాగభూషణం పేర్కొన్నారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఫ్యాక్టో నాయకులు పత్తికొండ విద్యాశాఖ అధికారి రామ్మోహన్ కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధన సమయం దహించుకుపోతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని, పలు ద పాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని నేటి నుంచి విధులకు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకం కు సంబంధించిన మాత్రమే కార్యకలాపాలు చేపడతామని అన్నారు.